## క్లుప్తంగా

### వైభవోపేతంగా సీతారాముల కల్యాణం



గుడిపాల: మండలంలోని రామభద్రాపురంలో శనివారం సీతారాముల కల్యాణోత్సవం వైభవోపేతంగా సాగింది. ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, గ్రామానికి చెందిన శివప్రసాద్ దంపతులచే గ్రామస్తుల సమక్షంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. తొలుత గ్రామ దేవతకు, ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

### సీఎంసీలో టీబీ వర్క్‌షాప్



మాట్లాడుతున్న వెంకటప్రసాద్

గుడిపాల: మండలంలోని చీలాపల్లె సీఎంసీలో శనివారం టీబీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా పనిచేస్తే క్షయ వ్యాధిని త్వరలో అంతం చేయవచ్చన్నారు. గతంలో కన్నా ఇప్పుడు మెరుగైన టీబీ నిర్ధారణ పరీక్షలు చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సీఎంసీ అసోసియేట్ డైరెక్టర్ కెన్నిడేవిడ్ మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేట్ పార్ట్నర్ షిప్ ద్వారా ప్రభుత్వం నుంచి సీఎంసీ ఆసుపత్రికి అందుతున్న సౌకర్యాలకు కృతజ్ఞతలు తెలిపారు.

### మంచి చేసినందుకే వైఎస్సార్‌సీపీలోకి



పార్టీలో చేరిన డేవిడ్ దంపతులతో విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: మా కుటుంబానికి మంచి చేసినందుకే టీడీపీని వదిలి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు 11వ డివిజన్ ఎల్‌బీపురం టీడీపీ కార్పొరేటర్ జయలక్ష్మి మరిది డేవిడ్ స్పష్టం చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి నివాసంలో 20 టీడీపీ నాయకులతో కలిసి పార్టీలో చేరారు. 1995 నుంచి పార్టీలో తాను ఉన్నానని అయినా విలువలేదన్నారు. జన్మభూమి కమిటీలో సైతం ఉన్నట్లు వివరించారు. టీడీపీకి చెందిన తన కుటుంబానికి అమ్మఒడి, ఆటో కానుక, విద్యాకానుక అందినట్లు వెల్లడించారు. చిత్తూరులో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కష్టపడి పనిచేస్తానని వివరించారు. పార్టీలో చేరిన వారిలో మాధవన్, సెల్వం, శ్రీనివాసులు, గజ, శివ, సుధనాయుడు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

### నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం పనిచేస్తాయని అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై శనివారం తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలు పనిచేస్తాయని వెల్లడించారు.







చిత్తూరు: పాలూరు ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, రీడ్స్‌పేటలో నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, కార్పొరేటర్ షర్మిల ప్రచారం, గుడిపాల: బసవాపల్లె పంచాయతీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# జనం మెచ్చిన నాయకుడు జగనన్న

- టీడీపీని నమ్మితే మోసపోవడం ఖాయం
- పనిచేసే ప్రభుత్వానికి మద్దతు పలకండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి







చిత్తూరు: ఓబనపల్లెలో ఓటరుతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి, డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించి, వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): జగనన్న జనం మెచ్చిన నాయకుడని మళ్లీ ఆశీర్వదించి, గెలిపిస్తే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వస్తాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మండలం పాలూరు పంచాయతీలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఐదేళ్ల సంక్షేమ పాలనను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనిచేసే ప్రభుత్వానికే మద్దతు పలకాలన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలు విని మోసపోవద్దని సూచించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవమంటూ రాష్ట్రానికి ఏం చేయలేదని విమర్శించారు. ఒకవేళ బాబు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీల దాదాగిరీ చేస్తాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను నామరూపాల్లేకుండా పోతాయని, పిల్లల భవిష్యత్ అగమ్య గోచరంగా మారుతుందని వివరించారు. అవ్వతాతలకు పింఛన్ కావాలంటే మండల కార్యాలయం వద్ద రోజుల తరబడి నిరీక్షించక తప్పదన్నారు. కొత్త పింఛను మంజూరు కావాలంటే, పాత పింఛనుదారుడు మరణించాలన్న నిబంధన మళ్లీ వస్తుందని చెప్పారు. అదే జగనన్న అధికారంలోకి వస్తే ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా మన ఇంటిని వెతుక్కుంటూ వస్తాయని గుర్తుచేశారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని సూచించారు. ఎన్నికలు రాగానే, ఎక్కడెక్కడి నుంచో డబ్బు సంచులతో నాయకులు దిగిపోతారని, ఎన్నికలయ్యాక మళ్లీ వేరే రాష్ట్రం వెళ్లిపోయి వ్యాపారాలు చక్కబెట్టుకుంటారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే, నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు అమరనాథ్‌రెడ్డి, రాము, మురగ, శ్యామ్, ప్రవీణ్, దాము, దిలీప్, సుబ్రమణి, గోవిందనాయుడు, రవినాయుడు, జయచంద్ర, రాజేంద్ర, భాస్కర్, వేలస్వామి, పరాందమయ్య, నంద, లోక, పాండి, స్టాండ్లీ, దిలీప్‌రెడ్డి, ధర్మారెడ్డి, రాజా పాల్గొన్నారు.

#### బాబుకు ఇవే చివరి ఎన్నికలు

చిత్తూరు కార్పొరేషన్: కుట్రలు, కుతంత్రాల్లో ఆరితేరిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇవే ఆఖరి ఎన్నికలు అవుతాయని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. స్థానిక ఓబనపల్లెలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాక్షేత్రంలో ప్రజలకు మంచి చేయాల్సిన చంద్రబాబు పింఛన్ దారుల ఉసురు పోసుకుంటున్నారంటూ మండిపడ్డారు. ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు, ఇస్తున్నారని, ఇప్పుడు చంద్రబాబు సకాలంలో పింఛన్ దక్కకుండా అడ్డు పడ్డారని విమర్శించారు. ఇటువంటి వ్యక్తికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని, ప్రజలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు కావాలన్నారు. అనంతరం డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాజీ సీఎం వైఎస్సార్ చిత్రపటానికి పూజలు చేశారు. డివిజన్‌లో ప్రధానమైన డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి, నాయకులు నారాయణ, గోపి, శీన, సెల్వ, హమీద్ పాల్గొన్నారు.

#### నగరంలో విస్తృత ప్రచారం

గత ఐదు సంవత్సరాల్లో జరిగిన మేలును గుర్తుపెట్టుకొని ఓటర్లు ఆలోచించి నాయకులను ఎన్నుకోవాలని విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి తెలిపారు. ఆమె శనివారం వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో ప్రచారం చేశారు. ఎన్నికల్లో తన భర్త విజయానందరెడ్డిని ఆశ్వీరదించాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో నాయకులు అంజలిరెడ్డి, ప్రతిమారెడ్డి, జస్టిన్ తదితరులు పాల్గొన్నారు. రామ్‌నగర్‌కాలనీలో బెంగళూరు, చెన్నైలో పనిచేస్తున్న స్టాఫ్‌వేర్ ఇంజనీర్లు ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ, పేదల కష్టాలు తీరాంటే జగనన్న తిరిగి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. చిత్తూరువాసులైన తాము ప్రతి శని, ఆదివారాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ యువత అధ్యక్షుడు డీసీ మనోజ్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, రెడ్డిసాయి, వినయ్, వివేక్, భాను, కిరన్, శబరీష్, అఖిలేష్‌రెడ్డి, హరిసాయి, మంగ తదితరులు పాల్గొన్నారు. రీడ్స్‌పేటలో నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, కార్పొరేటర్ షర్మిల కలిసి ప్రచారం చేశారు. నాయకులు అరుల్, ధనరాజ్, రవీంద్ర పాల్గొన్నారు. సీకేపల్లెలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం కార్యదర్శి పూతలపట్టు గౌహతి సుబ్బారెడ్డి, కార్పొరేటర్ హరిణిరెడ్డి ప్రచారం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. నాయకులు మధు, రుషి పాల్గొన్నారు. ఇరువారంలో నాయకులు డేవిడ్ ప్రచారం చేశారు.

#### ఇంటింటా ఎన్నికల ప్రచారం

గుడిపాల: మండలంలో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వసంతాపురం పంచాయతీలో సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో చెరువు ముందరవూరు, తుమ్మలవారిపల్లెలో ప్రచారం చేశారు. 189 కొత్తపల్లెలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, సర్పంచ్ పెరిల్లా ఆధ్వర్యంలో, బసవాపల్లె పంచాయతీలో సర్పంచ్ సుధాకర్‌నాయుడు, బొమ్మసముద్రంలో ఎంపీటీసీ రవి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.









గుడిపాల: 189కొత్తపల్లె పంచాయతీలో ప్రచారం చేస్తున్న నాయకులు, గుడిపాలలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, వెంకటేశ్వరకాలనీలో ఇందుమతి ప్రచారం, సీకేపల్లెలో మహిళా జిల్లా కార్యదర్శి గౌహతిసుబ్బారెడ్డి, కార్పొరేటర్ హరిణిరెడ్డి ప్రచారం

## రౌడీ చేతిలో నలిగిన చిత్తూరు



మహిళతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఈ చిత్తూరు నలబై ఏళ్లుగా ఓ రౌడీ చేతిలో నలిగిపోయిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు మండలం పిళ్లారిమిట్ట గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఓ మహిళ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరింది. దీనిపై ఆయన స్పందిస్తూ, రెండేళ్లకు ముందు సీఎం వైఎస్ జగన్ సహకారంతో చిత్తూరుకు సమీపంలో ఐటీ హబ్ తీసుకొచ్చామన్నారు. సుమారు ఐదు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రధానంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించిందని గుర్తుచేశారు. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయితే చిత్తూరును అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్థిక సాయం అందజేత





విజయానందరెడ్డి చేతులమీదుగా నాగరాజుకు ఆర్థిక సాయం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక ఎల్‌బీపురం డివిజన్‌కు చెందిన నాగరాజుకు స్మైల్స్ ఫౌండేషన్ ద్వారా రూ.40 వేలు ఆర్థిక సాయం చేశారు. నగర వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులు డీసీ మనోజ్‌రెడ్డి, స్నేహబృందంతో కలిసి శనివారం ఈ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో నాగరాజు గాయపడి కాలుకు ఆపరేషన్ చేయించుకున్నారు. అతనికి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి చేతులమీదుగా ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సోమురెడ్డి, హర్ష, రెడ్డిసాయి, పురుషోత్తం, భాను, సోను, సద్దాం పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ ఇవ్వలేదనే హత్య!

చిత్తూరు అర్బన్: నగరంలోని తోటపాళ్యంలో రెండు రోజులక్రితం యువకుడు ఆశిక్ హత్య కేసులో నిందితుడు పవన్ కల్యాణ్ (29)ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. కేరళకు చెందిన ఆశిక్ చిత్తూరులో కూలి పనులు చేసుకునేవాడు. అతడికి పవన్ కల్యాణ్, బద్రి అనే ఇద్దరితో పరిచయం ఏర్పడింది. వీళ్లిద్దరూ వారి సెల్‌ఫోన్లను, ఒక్కొక్కటి రూ.500 చొప్పున ఆశిక్ వద్ద తాకట్టు పెట్టారు. గురువారం రాత్రి ఓబనపల్లె వద్ద ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. ఈ సమయంలో తమ ఫోన్లు తిరిగి ఇచ్చేయాలని ఆశిక్‌ను కోరారు. దీనికి అంగీకరించని ఆశిక్ ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో పవన్‌కల్యాణ్, బద్రి అడ్డుకుని కత్తితో నరికి ఆశిక్‌ను చంపేశారు. ఈ కేసులో గంగనపల్లెకు చెందిన పవన్ కల్యాణ్‌ను అరెస్టుచేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ ఉలసయ్య తెలిపారు. మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## వేసవి శిక్షణ శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు తపోవనం హైస్కూల్లో బాపు బాలభవన్ వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీవైఈఓ చంద్రశేఖర్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శిబిరంలో పిల్లలకు చిత్రలేఖనం, పేపర్ కటింగ్, కలరింగ్ నేర్పించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు శిక్షణ ఉంటుందని వివరించారు.

#### గ్రంథాలయాల్లో..

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి శిబిరాలు ప్రారంభమవుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కొనసాగనున్న శిబిరాల్లో కథలు వినడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, డ్రాయింగ్, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

## వైఎస్సార్‌సీపీతోనే మైనారిటీలు



మాట్లాడుతున్న ఖాజీ సయ్యద్ అబ్దుల్‌మాలిక్

చిత్తూరు కార్పొరేషన్: మైనారిటీలు వైఎస్సార్‌సీపీతోనే ఉంటారని ఖాజీ సయ్యద్ అబ్దుల్‌మాలిక్ స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల తనతో మాట్లాడాలని టీడీపీ నాయకులు పిలిపించి పార్టీ కండువా వేశారని వెల్లడించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి మైనారిటీలు ఎప్పుడూ మద్దతు ఇవ్వరని చెప్పారు. తాము ఎప్పుడు వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ముస్లింలకు ఒక మంత్రి పదవి కూడా చంద్రబాబు ఇవ్వలేదని గుర్తుచేశారు. జగనన్న డిప్యూటీ సీఎం పదవి ముస్లింలకు ఇచ్చారని తెలిపారు. చిత్తూరులో విజయానందరెడ్డి తన వంతుగా మార్కెట్, ప్రభుత్వ ఆస్పత్రి గేటును వదులుకున్నారని పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా భోజనం, అంబులెన్స్ ఏర్పాటు చేశారన్నారు. రంజాన్ తోఫాను ఇచ్చారని, షాదీమహల్ అభివృద్ధికి నిధులు అందించారని చెప్పారు. మైనారిటీలకు సాయం చేసినవారికి తమ మద్దతు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, నాయకులు నౌషాద్, నవాజ్ పాల్గొన్నారు.

# ఎన్నికలప్పుడే హడావుడి.. తర్వాత కనుమరుగు

పచ్చనేతలు ఎన్నికలొస్తే ఇట్టే వాలిపోతారు. ఊరూరా తిరుగుతారు. ధాం..ధూం అంటూ హడావుడి చేస్తారు. డబ్బులిచ్చి ఓటర్లను కొనే ప్రయత్నం చేస్తారు. ప్రచారమంటూ డబ్బులు చల్లుతారు. రెచ్చగొట్టి పచ్చని పల్లెల్లో చిచ్చుపెడతారు. ఎన్నికలు ముగిశాక నెమ్మదిగా ఈ ఊరికే సంబంధం లేదన్నట్టు వలస వెళ్లిపోతారు. ఐదేళ్ల పాటు కనుమరుగవుతారు. ఇది గ్రహించిన ప్రజలు స్థానిక నాయకత్వం వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో కరోనా లాంటి ఆపద వేళ ఆదుకున్ననాయకులెవరో తెలుసుకున్న ప్రజలు ఈ సారి తెలివిగా ముందుకు కదులుతున్నారు.

- ప్రచారానికి మాత్రం సై అంటున్న స్థానికులు
- అప్రమత్తంగా ఉంటూనే తెలివిగా కదులుతున్న ఓటరు
- కరోనా వేళ ఆదుకున్నదెవరో గ్రహించిన నగరవాసులు
- స్థానికంగా అందుబాటులో ఉన్న నాయకుడిపై మొగ్గు





చిత్తూరులో ప్రచారం చేస్తున్న ప్రధాన పార్టీల నాయకులు (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుత ఎన్నికల సమయంలో చిత్తూరు నియోజకవర్గంలో లోకల్, నాన్‌లోకల్ మధ్యనే పోటీ నెలకొంది. ఇక్కడ టీడీపీ భారీ మొత్తంలో వ్యయం చేస్తూ, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఎన్నికల ప్రచారం మొదలు, సభలు, సమావేశాలకు వచ్చిన జనానికి మద్యం పంచి ప్రలోభాలకు గురిచేస్తోంది. కాసులిచ్చి తమ్ముళ్లు వివిధ వర్గాలను వశం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఓటుకు నోటిచ్చి ఓటర్లను కొనే ప్రయత్నమూ చేస్తోంది. దీనికి డబ్బులు విపరీతంగా ఖర్చుపెడుతోంది. దీంతో టీడీపీ ప్రచారానికి అధికంగా డబ్బులిస్తున్నారని తెలిసి స్థానిక యువకులు కదులుతున్నారు. ఎన్నికల తర్వాత వారు కనిపించరని స్థానికులు అంచనాకు వచ్చారు. గత ఐదేళ్లుగా జరుగుతున్న తంతు గమనిస్తున్న వారందరికీ ఈ విషయం అర్థమవుతుంది. ఎన్నికల సమయంలో టీడీపీ ఇచ్చే డబ్బులు తీసుకుని, ప్రచారం చేస్తున్నాం కానీ, ఓటు మాత్రం స్థానికులకేనంటూ స్పష్టం చేస్తున్నారు. ఐదేళ్లలో సంక్షేమం ఇల్లు వెతుక్కొని వచ్చిందంటున్నారు. అది కూడా ఎలాంటి వివక్ష లేకుండా పారదర్శకంగా పంచి పెట్టారని చెబుతున్నారు. మళ్లీ ఫ్యాన్‌ను గెలిపించుకుంటే మరో ఐదేళ్ల సంక్షేమాన్ని చూడొచ్చని, లేకుంటే సంక్షోభాన్ని చూడాల్సి వస్తోందని అంటున్నారు. టీడీపీ ప్రజలను నమ్మించి మోసం చేయాలని చూస్తోంది. మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తోంది. బహుమతుల పేరుతో ఎర వేస్తోంది. దీనిపై ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి.

#### లోకల్ వర్సెస్ నాన్‌లోకల్

చిత్తూరు నియోజకవర్గంలో ప్రధాన పోటీ టీడీపీ, వైఎస్సార్ సీపీ మధ్యనే ఉంది. అయితే వీరిద్దరూ ఒకరు లోకల్, మరొకరు నాన్‌లోకల్ కావడంతో చర్చనీయాంశమైంది. ప్రజా నాయకుడిగా ముద్ర వేసుకున్న స్థానిక అభ్యర్థి ప్రచారంలోనూ దూసుకెళుతున్నారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన సేవా కార్యక్రమాలను, పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించి ఓటడుగుతున్నారు. అయితే నాన్‌లోకల్ అభ్యర్థి, స్థానికంగా ఉంటున్న నాయకుల మీద ఆధారపడి ప్రచారం కొనసాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న నాయకులకు, కార్యకర్తలకు డబ్బులు విపరీతంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. వీరు కూడా అదే అదనుగా డబ్బులు తీసుకుని ప్రచారం చేస్తున్నారు. వీరిలో సగం మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు తీసుకుంటున్న వారే కావడం గమనార్హం. ఈ నాయకులు ఐదేళ్లకోసారి వచ్చి ప్రచారానికి ఇచ్చే డబ్బులు తీసుకుని ప్రచారం చేస్తున్నారు. అయితే ఓటు మాత్రం ఐదేళ్లపాటు సంక్షేమ పథకాలు ఇచ్చే వారికేనని వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కరోనా సంక్షోభంలో కూడా స్థానిక నాయకులు మాత్రమే అందుబాటులో ఉండి సాయమందించారని వారు కూడా చెబుతున్నారు. ఇప్పుడు నాన్‌లోకల్ అభ్యర్థిని కలవాలంటేనే పక్క రాష్ట్రంలోని బెంగళూరుకు వెళ్లాల్సి వస్తుందని ఆ పార్టీ నాయకులే స్పష్టం చేస్తున్నారు. లేకుంటే ఆయన వీలు చూసుకుని, చిత్తూరుకు ఎప్పుడొస్తారో వేచి చూడాల్సిన దుస్థితి. ఇదే భావన మిగిలిన మండల నాయకుల్లో సైతం వ్యక్తమవుతోంది. తామే టీడీపీకి పాడె కడుతామని, కచ్చితంగా స్థానిక నాయకత్వాన్నే ఆదరిస్తామని వారు బహిరంగంగా చెబుతున్నారు. దీనికి నిదర్శనంగా రెండు రోజుల క్రితం టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు రూ.500 ఇస్తామని పిలిచిన జనం స్పందించకపోవడం గమనార్హం.

#### పల్లెల్లో టీడీపీ చిచ్చు

ఈ ఎన్నికల్లో జరగబోయే ఓటమిని టీడీపీ ముందుగానే పసిగట్టింది. అందుకే పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తోంది. చంద్రబాబు అడుగుజాడల్లో స్థానిక టీడీపీ అభ్యర్థి సైతం పయనిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న దళిత గ్రామాలపై కక్ష కట్టారు. పార్టీకి సానుకూలంగా ఉన్న వ్యక్తుల ద్వారా రెచ్చగొడుతున్నారు. దళితుల మధ్య గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా ఓట్లు చీల్చాలని చూస్తున్నారు. కానీ ఇలాంటి కుట్ర రాజకీయాలకు కాలం చెల్లిందని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి టీడీపీకి గుణపాఠం చెప్పక తప్పదని స్పష్టం చేస్తున్నారు.

## చింతను వదిలి ఆనందంగా జీవించండి





హాజరైన ప్రజలు, ప్రవచిస్తున్న గరికపాటి నరసింహారావు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చింతతో కూడుకున్న జీవితాన్ని వదిలి ఆనందమయంగా జీవించాలని గరికపాటి నరసింహారావు ప్రవచించారు. నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో శనివారం కూడా భక్త చింతామణి శతకంపై ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనసును జయించిన వాడే నిజమైన విజేత అన్నారు. ప్రతి వ్యక్తి తన వితంలో అనేక కోరికలుంటాయని వాటిని సాధించాలని పుట్టినప్పటి నుంచి మరణించే వరకు పోరాటం చేస్తున్నారని చెప్పారు. చివరకు విజేత కాకుండానే తనువు చాలిస్తున్నారని చెప్పుకొచ్చారు. దీని నుంచి బయట పడాలంటే మనసును నిలకడగా ఉంచుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగానే భక్త చింతామణి శతకం రచించారని ఆయన పేర్కొన్నారు.